


కరీంనగర్ రూరల్: ప్రచారం చేస్తున్న గంగుల హరిహరన్, నాయకులు



కొత్తపల్లి: రాణిపూర్‌లో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు

# అభివృద్ధికి పట్టం కట్టాలి

- కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దు
- ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు



కొత్తపల్లి: ఆసిఫ్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ రూరల్, నవంబర్ 18: ఈ ఎన్నికల్లో అభివృద్ధికి పట్టం కట్టాలని రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ కుమారుడు హరిహరన్ ప్రజలను కోరారు. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామంలో శనివారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ప్రభుత్వ పథకాలను, కరీంనగర్ నియోజకవర్గంలో మంత్రి గంగుల కమలాకర్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా గంగుల హరిహరన్ మాట్లాడుతూ, బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు శ్రీరామోజు తిరుపతి, యూత్ మండలాధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు గుండేటి కుమార్, గాజుల హరికృష్ణ, నేత శ్రీధర్, గోలే సంతోష్, తోట తిరుపతి పాల్గొన్నారు.

కొత్తపల్లి, నవంబర్ 18: బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్‌కు మద్దతుగా ప్రజాప్రతినిధులు ప్రచారం చేస్తున్నారు. కొత్తపల్లి పట్టణ పరిధిలోని రాణిపూర్‌లో మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అలాగే, మండలంలోని ఆసిఫ్‌నగర్, మల్కాపూర్, ఎలగందుల, చింతకుంట గ్రామాల్లో ప్రజాప్రతినిధులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గంగుల కమలాకర్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు.

# పీఎస్‌లలో వసతులపై సమీక్షించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి
- మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో సమీక్ష



మాట్లాడుతున్న డీఈవో పమేలా సత్పతి

కలెక్టరేట్, నవంబర్ 18: జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన మౌలిక వసతులపై సమీక్షించాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఆమె పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన వసతులపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ రోజున జిల్లాలోని 1338 కేంద్రాల్లో ర్యాంపులు, విద్యుత్ సౌకర్యం, ఇతర వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాల్లో రాజకీయ పార్టీలకు చెందిన రంగులు వాడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. నిర్దేశించిన గడువులోగా పోలింగ్ చిట్టీల పంపిణీ పూర్తయ్యేలా చూడాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ శాఖ ఏవోల సహకారంతో ప్రతి ఓటరుకు పోల్ చిట్టి అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించాలని, కేంద్రాల్లో జరుగుతున్న పనుల పురోగతిపై సమీక్షించాలని, ఎన్నికల కోడ్ ముగిసే వరకు అధికారులు, సిబ్బంది ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో పవన్‌కుమార్, జిల్లాలోని మున్సిపాలిటీల కమిషనర్లు, ఆయా మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

### 22 నుంచి హోమ్ ఓటింగ్

వృద్ధులు, దివ్యాంగులకు ఈనెల 22 నుంచి మూడు రోజుల పాటు హోమ్ ఓటింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం వివిధ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఎన్నికల ఏర్పాట్లపై జిల్లాలోని నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లలో తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎన్నికల కమిషన్ సూచన మేరకు జిల్లాలో 12డీ ద్వారా ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేందుకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగానే 80 ఏళ్లు పైబడ్డ 644 మంది వయోవృద్ధులకు, నలభై శాతం కంటే అధికంగా వైకల్యం కలిగిన 373 మందికి ఈనెల 22 నుంచి 24 వరకు హోమ్ ఓటింగ్ అవకాశం కల్పిస్తున్నామన్నారు. అలాగే, ఓటర్లందరికీ బీఎల్‌వోల ద్వారా పోల్ చిట్టీలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పోలింగ్ రోజు ఓటర్లంతా ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి విధిగా వెంట తెచ్చుకోవాలన్నారు. అనంతరం పోలింగ్ కోసం చేపట్టిన చర్యలను వివరించారు. టెండర్ ఓటుపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డీఆర్వో పవన్‌కుమార్, ఆయా పార్టీల ప్రతినిధులు గాలి అనిల్‌కుమార్, అంజయ్య, శ్రీనివాస్, మోహనచారి, బర్కత్ అలీ, ఒంటెల సత్యనారాయణరెడ్డి, కల్యాడపు ఆగయ్య, సత్తినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

కరీంనగర్ రూరల్, నవంబర్ 18: కరీంనగర్ రూరల్ మండలం దుబ్బపల్లి, జూబ్లీనగర్ గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పలువురు శనివారం మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో పబ్బతి మోహన్‌రెడ్డి, పబ్బతి మల్లారెడ్డి, పబ్బతి వేణుగోపాల్‌రెడ్డి, పబ్బతి వెంకటరమణారెడ్డి, పబ్బతి మధుకర్‌రెడ్డి, పబ్బతి విజేందర్ రెడ్డి, మధుకర్ రెడ్డి, ఇరుకుల్ల వెంకటేశ్, దొమ్మటి అశోక్, దుగ్యాని శ్రీనివాస్, చెల్మెల శ్రావణ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పబ్బతి రంగారెడ్డి, కూర శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, సర్పంచ్ సిరిగిరి దుర్గా, రమేశ్, జూబ్లీనగర్ ఎంపీటీసీ చల్ల రామక్క, లింగారెడ్డి, రుద్ర రాములు, వెంకటేశ్వర్లు, మునిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జూబ్లీనగర్‌లో బీఆర్ఎస్‌లో చేరిన యువకులతో మంత్రి గంగుల కమలాకర్

# గంగులకు ఎరుకల సంఘం నాయకుల మద్దతు



మాట్లాడుతున్న ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు

తెలంగాణచౌక్, నవంబర్ 18: బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్ భవనంలో శనివారం ఆయన రాష్ట్ర కమిటీ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాలు ఎరుకల కులస్తులను పట్టించుకోలేదని విమర్శించారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనలో ఎరుకల కులస్తులకు ఆర్థికంగా, రాజకీయంగా గుర్తింపు లభించిందన్నారు. రాష్ట్ర రాజధానిలో ఎరుకల కులస్తుల ఆత్మగౌరవ భవనం కోసం ఎకరం స్థలంతో పాటు రూ. కోటి మంజూరు చేసినట్లు తెలిపారు. ఎరుకల వృత్తిదారులకు ఆర్థిక సాయం కోసం ఎంపోర్‌మెంట్ స్కీమ్ ఏర్పాటు చేసి రూ. 60 కోట్లను కేటాయించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ అభ్యర్థుల విజయం కోసం ప్రచారం చేస్తామని తెలిపారు. అందులో భాగంగా కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా కుతాడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజలింగం, కోశాధికారిగా మల్లేశం, ఉపాధ్యక్షులుగా సమ్మయ్య, కుమార స్వామి, సుధాకర్, మొండయ్య, శ్రీనివాస్, సంపత్ ఎన్నికయ్యారు. సమావేశంలో ఎరుకల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బుచ్చయ్య, ఉపాధ్యక్షుడు రాజయ్య పాల్గొన్నారు.

# ముస్లింల జీవనానికి తెలంగాణే సేఫ్

- ఇతర రాష్ట్రాల్లో అభద్రతతో బతుకుతున్నారు
- ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్

కలెక్టరేట్, నవంబర్ 18: మతసామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న తెలంగాణలోనే ముస్లింలు సేఫ్‌గా జీవనం సాగిస్తున్నారని, ఇతర రాష్ట్రాల్లో అభద్రతా భావంతో క్షణమొక యుగంలా బతుకు వెళ్లదీస్తున్నారని ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పేర్కొన్నారు. కరీంనగర్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమైన నేపథ్యంలో నగరంలోని దారుసలాంలో శనివారం ఆయన కృతజ్ఞతాపూర్వక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ, కేసీఆర్ నేతృత్వంలో తొమ్మిదేళ్లుగా రాష్ట్రంలో మతసామరస్యత వెల్లివిరుస్తోందని కొనియాడారు. ఈ ఎన్నికల్లో కేసీఆర్ పాలన, కరీంనగర్‌లో మంత్రి గంగుల కమలాకర్ చేసిన అభివృద్ధిని చూసి, కారు గుర్తుకు ఓటు వేసేందుకు ముస్లిం సమాజం సిద్ధమవుతోందన్నారు. ఇందుకు నిదర్శనం ప్రజా ఆశీర్వాద సభకు వేల సంఖ్యలో నగరంలోని ముస్లింలు తరలిరావడమేనన్నారు. సమావేశంలో ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీ అతీఫ్ అతీనీ, కార్పొరేటర్లు అఖిల్ ఫిరోజ్, షర్ఫొద్దీన్, నాయకులు అలీ బాబా, వివిధ డివిజన్ల అధ్యక్షులు, ఎంఐఎం కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ కాలేజీయేట్ పోటీలు ప్రారంభం



ప్రతిభ చూపిన మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

కొత్తపల్లి/కమాన్‌చౌరస్తా, నవంబర్ 18: శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని పలు కళాశాలల విద్యార్థులకు ఇంటర్ కాలేజీయేట్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో యూనివర్సిటీ పరిధిలోని 18 కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఎస్సార్‌ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఫైనల్లో తలపడగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (కరీంనగర్) విద్యార్థులు 26-22 స్కోరు తేడాతో విజయం సాధించారు. విజయం సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీలక్ష్మి, పీడీ గంగ్ర శ్రీధర్ రావు అభినందించారు. పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను యూనివర్సిటీ స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

# జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

కొత్తపల్లి, నవంబర్ 18: హర్యాన రాష్ట్రంలోని హిస్సార్‌లో జరిగే జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు నగరంలోని ట్రినిటీ కళాశాల విద్యార్థి కార్తీక్ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు తెలిపారు. ఇటీవల సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న కార్తీక్ అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. కాగా, కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్తీక్‌ను ట్రినిటి కళాశాలల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దయాకర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.